క్లుప్తంగా

25న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం వద్ద ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతం నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు తెలిపారు. మన గుడిలో భాగంగా పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణార్థం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బ్యానర్ ఏర్పాటు చేసి కరపత్రాలు గ్రామస్తులకు అందజేశారు.

నేటి నుంచి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: స్థానిక రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తెలిపారు. కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వార్లను పెళ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరిస్తారు. ఆదివారం నిత్యహోమాలు, బలిహరణాలు నిర్వహించి రాత్రి ఎదుర్కోలు సన్నాహం నిర్వహిస్తారు. అనంతరం తట్టా శ్రీనివాస రామానుజమ్, మంజుల దంపతులచే జగజ్యోతి నిర్వహించిన అనంతరం స్వామి వారి దివ్యకల్యాణ జరిపిస్తారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి రథత్సవంతో పాటు నరసింహస్వామి కోలలు ఉంటాయని ఆలయ మేనేజర్ తెలిపారు. చివరిరోజైన మంగళవారం పుష్పయాగోత్సవం, ద్వాదశ ప్రదక్షిణల అనంతరం స్వామి వారికి పవళింపు సేవలతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిత్య ఔపాసన, బలిహరణ, విశేష అర్చనలు, హోమం, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. సాయంత్రం నిత్య ఔపాసన, బలిహరణ, విశేష అర్చనలు చేశారు. రాత్రికి ఎదుర్కోలు సన్నాహం, గజవాహనంపై స్వామివారు, కల్పవృక్ష వాహనంపై అమ్మవార్లు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్. సీతారామానుజాచార్యులు, జ్యోతిర్లత దంపతులు పాల్గొన్నారు. 23వ తేదీ శనివారం రాత్రి స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు పర్యవేక్షించారు.

అన్నదానానికి బియ్యం వితరణ

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో ఈ నెల 25వ తేదీన ప్రతిష్ఠ జరగనున్న విజయకోదండరామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మాజీ పార్లమెంట్ సభ్యుడు బాడిగ రామకృష్ణ సుమారు రూ. 30వేల విలువ చేసే బియ్యం అన్న సమారాధన నిమిత్తం శుక్రవారం అందజేశారు. బాడిగ తన తల్లిదండ్రులు బాడిగ శేషగిరిరావు, రామాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విరాళాన్ని అందజేశారు.

నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.1.65లక్షలు

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ వారి హుండీ ఆదాయాన్ని దేవదాయ అధికారులు శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు గాను హుండీ ద్వారా రూ.1,65,407 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ సీహెచ్ సుధాకార్ తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి రూ.లక్ష విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి విశ్రాంత సీఎస్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దాదాపు రెండు దశాబ్దాల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన కాకి మాధవరావు జనవరి నెలలో చల్లపల్లి గ్రామంలో జరిగిన స్వచ్ఛ సుందర చల్లపల్లి మూడు వేల రోజుల వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్- డాక్టర్ తరిగోపుల పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాన్ని చూసిన మాధవరావు శుక్రవారం తన వంతుగా రూ.లక్ష విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా 'మన కోసం మనం ట్రస్ట్'కు పంపించారు. రూ.లక్ష విరాళం పంపిన కాకి మాధవరావుకు డీఆర్కే ప్రసాద్ - పద్మావతి దంపతులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా చర్యలు



పోలీస్ కవాతులో పాల్గొన్న డీఎస్పీ రమేష్‌బాబు తదితరులు



మల్లవోలులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

డీటీసీ డీఎస్పీ రమేష్‌బాబు

పెడన: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీస్‌శాఖాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం డీఎస్పీ కె. రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలో పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పెడన పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పెడన బస్టాండు సెంటరు, బంటుమిల్లి రోడ్డు, పెడన మార్కెట్‌యార్డు తిరిగి గూడూరు రోడ్డు, బ్రహ్మపురం, కొత్తపేట మీదుగా డీటీ పాలెం నుంచి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెడన నియోజకవర్గంలో ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు కవాతు నిర్వహించామన్నారు. నాలుగు మండలాలకు చెందిన ఎస్‌ఐలు, సిబ్బంది, పారామిలటరీ దళాలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గూడూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలీసు శాఖాపరంగా పటిష్ఠ భద్రత కల్పిస్తామని బందరు డీఎస్పీ మహ్మద్ అబ్దుల్ సుభాన్ అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, పోలవరం గ్రామాల్లో డీఎస్పీ మహ్మద్ అబ్దుల్ సుభాన్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో ఏమైనా భయాందోళనలు ఉంటే వాటిని పోగొట్టి రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే లక్ష్యంగా పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిష్పక్షపాత, పారదర్శకమైన ఎన్నికలే లక్ష్యంగా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, గూడూరు ఎస్‌ఐ ఐ.వీర్రాజు పాల్గొన్నారు.

చేసిన మంచిని గుర్తించి.. మరో చాన్స్ ఇవ్వండి

ప్రజాదీవెన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్


రాము, హారికలకు హారతులు ఇస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి తదితరులు

పెడన: జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి మళ్లీ మంచి జరగాలని కోరుకుంటే తప్పనిసరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరో అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి ఆయన పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీపైడమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత1, 2, 3వ వార్డులలో గడప గడపకూ తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే జగనన్న ప్రభుత్వం జనరంజకమైన పరిపాలన అందించిందని, తేడా గుర్తించి ఓటేయాలన్నారు. లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాల నిధులు ఎటువంటి దళారులు లేకుండా అందించిన ఘనత జగన్ ప్రభుత్వంలోనే జరిగిందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

మీ బిడ్డగా ఒక్కసారి చాన్స్ ఇవ్వాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని రాము ఓటర్లను అభ్యర్థించారు. ఉప్పాల హారిక తన భర్త ఉప్పాల రమేష్(రాము)ను గెలిపించాలని కరపత్రాలను అందజేశారు. వీరితో ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మున్సిపల్ మాజీ చైర్మన్లు భళ్ల జ్యోత్స్నరాణి, బండారు ఆనందప్రసాద్, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, ఫ్లోర్ లీడర్ భళ్ల గంగయ్య, కౌన్సిలర్లు బల్ల పద్మావతి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి పాల్గొన్నారు.

నేడు నీలిపూడిలో ప్రజాదీవెన

కృత్తివెన్ను: మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రజాదీవెన కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో పెడన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొని ప్రతి గృహాన్ని సందర్శిస్తారని పేర్కొంది.

ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు

సమస్యాత్మక దీవుల్లో పర్యటించిన అవనిగడ్డ ఆర్‌ఓ బాల సుబ్రహ్మణ్యం


ఎదురుమొండిలో పర్యటిసతున్న ఆర్‌ఓ బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ తదితరులు

ఎదురుమొండి(నాగాయలంక): నియోజకవర్గంలో ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించేలా ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాలుగా పటిష్ఠమైన చర్యలు అమలు చేస్తామని అవనిగడ్డ నియోజకవర్గం ఎన్నికల అధికారి(ఆర్.ఓ) జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడదల అయిన నేపథ్యంలో అవనిగడ్డ ఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం మండలంలోని సమస్యాత్మక ప్రాంతమైన ఎదురుమొండి దీవులలో అవనిగడ్డ సబ్ డివిజనల్ పోలీసు అధికారి పి.మురళీధర్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటర్ల వివరాలు, తదితర విషయాలను బీఎల్‌ఓలు, గ్రామ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు, పెద్దలతో మాట్లాడి దీవుల్లో గ్రామాల భౌగోళిక స్వరూపం, ఎన్నికల్లో మౌలిక వసతుల అవసరత తదితర అంశాలను గుర్తించారు. డీఎస్పీ మురళీధర్‌తో మాట్లాడి గత ఎన్నికల్లో పోలింగ్ తీరుతెన్నులు, గొడవలకు అవకాశం ఏమైనా ఉందా అనే అంశాలపై చర్చించారు. నాగాయలంక ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు(కోడూరు) అవనిగడ్డ సీఐ పి.త్రినాథ్, స్థానిక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా నగర పర్యటన


నాగపోతరావు సెంటరులో కార్మికులతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. నగరంలోని ప్రధాన పార్కుకు విచ్చేసిన ప్రజలను ప్రతి ఒక్కరిని పలుకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేవతిసెంటర్‌లోని ఆర్‌కే గుడ్ టైమ్స్ హోటల్‌కు వెళ్లి అక్కడ పనిచేస్తున్న కార్మికులను ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా అక్కడి కార్మికులు పేర్ని కిట్టు తో సెల్ఫీలు దిగారు. ఆ తరువాత నాగపోతరావుసెంటర్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను ఆదరించాలని కోరారు. ఈ పర్యటనలో పేర్ని కిట్టు వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, ఐనం తాతారావు, శ్రీరాం చిన్నా, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, గాజుల భగవాన్, మొహమ్మద్ రఫీ, చీలి చక్రపాణి, మామిడిబత్తుల అజయ్ ఉన్నారు.

ఉత్సాహంగా ప్రచారం


పూల వ్యాపారులతో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్ బాబు

అవనిగడ్డ: అవనిగడ్డలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన సెంటరులోని పలు దుకాణాల వారిని కలిసి ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా కలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా అవనిగడ్డను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కేవీవీ వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతిదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, గార్లపాటి గోపీ, నాయకులు పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరమణ

పెడన: ఇష్టానుసారంగా ప్రచారాలు నిర్వహిస్తే కుదరదని, ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ప్రతి పార్టీ కూడా ప్రచారానికి అనుమతులు తీసుకోవాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఈఆర్వో)పి. వెంకటరమణ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన పెడన తహసీల్దార్ కార్యాలయంలోని ఈఆర్వో చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈఆర్వో మాట్లాడుతూ ఇంటిపై జెండా ఉన్నా, ప్రచారం చేసేందుకు వాహనాలపై స్టిక్కర్లు అంటించినా, ఇళ్లకు కరపత్రాలను అంటించిన కూడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనన్నారు. సువిధా యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రోజు ప్రచారం ఎక్కడ అనేది ముందుగానే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు. అభ్యర్థిని గెలిపించండి అని పేరు ప్రచారం చేసుకుంటే ఖర్చులు పడవని తెలిపారు. గతంలో కంటే ఈ దఫా ఎన్నికల నియమావళి, నిబంధనలు అధికంగా ఉన్నాయని వివిధ పార్టీల నాయకులు అధికారులు ముందు వాపోయారు. ఈ సందర్భంగా ఈఆర్వో నిబంధనలు పాటించి సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, టీడీపీ నాయకుడు శ్యామలయ్య తదితరులు పాల్గొన్నారు.

25న అద్దంకి నాంచారమ్మవారి జాతర ఉత్సవం


పెదప్రోలులో వేంచేసియున్న అద్దంకి నాంచారమ్మవారు

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అద్దంకి నాంచారమ్మ వారి జాతర మహోత్సవం ఈనెల 25వ తేదీ సోమవారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆలయ పాలక వర్గం పూర్తి చేసింది. అమ్మవారు సుమారు 154 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా నుంచి రజకుల ద్వారా గ్రామానికి వచ్చినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఎంతో చరిత్ర ప్రాశస్త్యం పొందిన అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ పద్మశాలీల ఆధ్వర్యంలో సుమారు 104 సంవత్సరాల క్రితం జరిగినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. గుంటూరు జిల్లా అద్దెపల్లి, పేటేరు, ఐలవరం, రేపల్లె, ఇసుకపల్లి గ్రామాల్లో విశేష పూజలందుకుంటున్న నాంచారమ్మవారు పెదప్రోలుకు వచ్చినట్లు చెబుతున్నారు. జూన్ 23, 1919లో గుడి నిర్మించాలని అమ్మవారి ఆజ్ఞతో నాడు భక్తులు పద్మశాలీల ఆధ్వర్యంలో చిన్న కోవెల నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవతకు 15 రోజుల పాటు సంబరాలు నిర్వహించి ఇంటింటా పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వంటి కానుకలు సమర్పించుకుంటారు. ఆలయ ప్రవేశంనాడు పెద్ద జాతర నిర్వహించి అమ్మవారిని ఆలయానికి చేర్చడం పరిపాటిగా వస్తోంది. అమ్మవారిని మచిలీపట్నం తీసుకెళ్లి పూజలు చేసి, ప్రధాన బజారులతో మూడు రోజుల పాటు ఊరేగింపు జరిపి, పెదప్రోలుకు తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది.


పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ ఆలయం

ప్రతి ఒక్కరూ ఓటేయాలి



ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈఆర్వో వెంకటరమణ

పెడన: ఓటున్న ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా ఓటు వేయాలని, ఆ ఓటు వేయడానికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మొబైల్ ఎల్‌ఈడీ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు పెడన నియోజకవర్గ రిటరినింగ్ అధికారి పి. వెంకటరమణ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన పెడన తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటు హక్కు కలిగిన వారు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ఓటర్లను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ఈ వాహనాన్ని ప్రారంభించామన్నారు. ఈ ప్రచార వాహనం మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. పెడన తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

కొడాలి(ఘంటసాల): రైతులు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండి సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. ఘంటసాల మండలం కొడాలి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఓటు హక్కు ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా నీతి నిజాయితీతో ప్రజాస్వామ్య పరిరక్షణకు నిర్భయంగా ఓటు వేస్తానని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఏడీఏ ఎస్.శ్యామల, వీఏఏ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

బంటుమిల్లి: స్థానిక కనకదుర్గ నగర్‌లో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం పండితుల వేద మంత్రాల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టీ గరికపాటి కూనారావు పర్యవేక్షణలో మూడు రోజులపాటు నిర్వహించనున్న పూజ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఇందులో భాగంగా దాతల దీక్ష ధారణల మధ్య పండితులు అంగలూరి కల్యాణ గోవిందాచార్యులు, కోమండూరి చక్రవర్తాచార్యుల శిష్య బృందం వేద మంత్రాలతో గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురార్పణ, యాగ అగ్నిప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిలువ మార్గం



బంటుమిల్లి: మండల పరిధిలోని ములపర్రు పంచాయతీ శివారు దళితవాడలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం సిలువ మార్గం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ కామా అనిల్‌కుమార్ పర్యవేక్షణలో సుందరంగా అలంకరించిన ట్రాక్టర్‌పై సిలువ ప్రతిమను ఉంచి పలు సంఘాలకు చెందిన దీక్షపరులు, భక్తులతో కలసి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు దైవ సేవకులు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'సురక్ష' శిబిరంలో 325 మందికి పరీక్షలు

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 325 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. పవన్‌కుమార్ పర్యవేక్షణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్త, వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసి మెరుగైన వైద్యం అవసరమైన వారికి పెద్ద ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు పి. హరిరామప్రసాదు, పీహెచ్‌సీ వైద్యులు సౌందర్య, కంటి వైద్యులు రమణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లు, ఉద్యోగులు 'నియమావళి'ని పాటించాలి

కోడూరు: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీల పరిధిలో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించాలని ఎంపీడీఓ సూచించారు. రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలు, సభలో పాల్గొనడానికి వీలు లేదని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంకితభావంతో పని చేసే వారికే గుర్తింపు

చల్లపల్లి: వైఎస్సార్ సీపీలో అంకితభావంతో పని చేసే వారికే గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల యూత్ కన్వీనర్ వెనిగళ్ల తారక జగదీష్ అన్నారు. చల్లపల్లికి చెందిన సీనియర్ మైనారిటీ నాయకుడు సయ్యద్ సికింద్ వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ చల్లపల్లి మండల మాజీ అధ్యక్షుడు వేమూరి గోవర్ధన్ పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రధాన కూడలిలో వారిద్దరినీ వెనిగళ్ల జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.